క్లుప్తంగా

సీసీ కెమెరాల అందజేత



పోలీసులకు సీసీ కెమెరాలు అందిస్తున్న గ్రీన్ కో ప్రతినిధి

హిందూపురం అర్బన్: పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం హైదరాబాద్‌కు చెందిన గ్రీన్ కో కంపెనీ బుధవారం రూ.25 లక్షల విలువ గల 150 వైర్‌లెస్ కెమెరాలను హిందూపురం సబ్ డివిజన్ అధికారి కేవీ మహేష్‌కు అందజేశారు. పోలీస్‌శాఖ అభ్యర్థన మేరకు నేరాలు నియంత్రించడానికి, శాంతి భద్రతలు మరింతగా పరిరక్షించేందుకు పట్టణంలో అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు అందించాలని ఎమ్మెల్యే బాలకృష్ణను కోరగా.. ఆయన సూచనలతో గ్రీన్‌కో ప్రతినిధులు సీసీ కెమెరాలు అందించారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

మడకశిర: నియోజకవర్గంలో ఇంటర్ పరీక్షలు మార్చి 1 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఇంటర్‌బోర్డు అధికారులు పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 7 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో చేస్తున్నట్లు పేర్కొన్నారు. అంతే కాకుండా అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఇదిలా ఉండగా నియోజకవర్గ వ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి చెందిన 4,186 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

శిథిలావస్థలో బస్‌షెల్టర్లు

- యాచకులు, వాహనాల పార్కింగ్‌కు వినియోగం
- కొన్నిచోట్ల అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన వైనం



గోరంట్ల మండలం వడిగేపల్లి వద్ద బస్‌షెల్టర్ దుస్థితి

సోమందేపల్లి: లక్షలాది రూపాయలు వెచ్చించి గ్రామాల్లో బస్‌షెల్టర్లను నిర్మించారు. ఏళ్లు గడుస్తున్నా వాటి వైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. పెనుకొండ నియోజకవర్గంలో దాదాపు 50 వరకూ బస్‌షెల్టర్లను ఎంపీ, జిల్లా పరిషత్ నిధులతో నిర్మించారు. అయితే అందులో ప్రయాణికులు వేచి ఉండటానికి సరైన సౌకర్యాలు లేవు. దీంతో అవి వినియోగంలోకి రాకపోగా ప్రస్తుతం ఆ భవనాలు దెబ్బతిన్నాయి. మరికొన్ని చోట్ల యాచకులకు విడిది కేంద్రాలుగా మరాయి. షెల్టర్లో కూర్చునేందుకు కనీసం కుర్చీలు లేవు. దీనికితోడు అపరిశుభ్రత నెలకొంది. మరికొన్ని చోట్ల అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. ఎప్పుడు రద్దీగా ఉండే హిందూపురం, అనంతపురం, బెంగళూరు వైపు వెళ్లే రహదారులపై నిర్మించిన బస్‌షెల్టర్లు కూడా నిరుపయోగంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల కోసం వేచి ఉండాలంటే ప్రయాణికులు ఎండ, వానకు ఆరుబయటే నిల్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా శిథిలావస్థకు చేరిన బస్ షెల్టర్లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

అధ్వానంగా ఉన్నాయి



బస్‌షెల్టర్లు చాలా అధ్వానంగా తయారయ్యాయి. ఎప్పుడో 25 ఏళ్ల క్రితం నిర్మించారు. వాటిపై అధికారుల పర్యవేక్షణ లేదు. దీంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని యాచకులు విడిది కేంద్రంగా మార్చుకున్నారు. కొన్ని చోట్ల మద్యం తాగి పేకాట ఆడటానికి వినియోగిస్తున్నారు. – షాజహాన్, సోమందేపల్లి

ఎండలో నిలబడాల్సిందే..



బస్ షెల్టర్లు ఉన్నా అవి శుభ్రంగా లేవు. బస్సుల కోసం వేచి ఉండాలంటే ఎండకు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. బస్‌షెల్టర్లకు మరమత్తు చేయించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలి. మోడ్రన్‌గా వాటిని తయారు చేస్తే బాగుంటుంది.

– శ్రీనివాసులు, సోమందేపల్లి

ఆటోను ఢీకొన్న కారు

- ఇద్దరికి గాయాలు

గోరంట్ల: మండల పరిధిలోని బూచేపల్లి సమీపంలో పుట్టపర్తి–గోరంట్ల ప్రధాన రహదారిపై బుధవారం ఎదురుగా ప్రయాణికులతో వస్తున్న ఆటోను కారు ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రయాణికులకు గాయలయ్యాయి. పోలీసుల వివరాలమేరకు... పెడపల్లి వైపు నుంచి గోరంట్లకు వస్తున్న ఆటోను గోరంట్ల వైపు నుంచి పుట్టపర్తి వైపు వెళ్తున్న కారు ఢీ కొంది. ఈ ఘటనలో కరావులపల్లి తండాకు చెందిన రామస్వామినాయక్, తిప్పానాయక్ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స తర్వాత వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యసేవల నిమిత్తం హిందూపురం తరలించారు.

1న వాహనాల వేలం

పెనుకొండ రూరల్: ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలను మార్చి 1వ తేదీన ఎక్సైజ్ పోలీసుస్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు సీఐ సృజన్ బాబు తెలిపారు. ఆసక్తి గలవారు రూ.3000 డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు.

కందులను గిడ్డంగులకు తరలించాలి

పెనుకొండ: రొద్దం మండల కేంద్రం నుంచి రవాణా సౌకర్యం లేక రైతులు అవస్థలు పడుతున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోనే అత్యధికంగా రొద్దం మండలంలో రైతులు కంది సాగు చేశారని, పండించిన కందులను ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేశారన్నారు. అయితే కొనుగోలు చేసిన కందులను గిడ్డంగులకు తరలించడంలో జాప్యం జరుగుతోందన్నారు. కందులు గిడ్డంగులకు చేరిన 15 రోజుల తర్వాతనే రైతుల ఖాతాలకు నగదు జమ అవుతుందన్నారు. ముందస్తు చర్యలు తీసుకుని ఉంటే రైతులకు ఇబ్బంది ఉండేది కాదన్నారు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..



డ్రైనేజీపై విరిగిపోయిన ఇనుప చువ్వలు

పెనుకొండ రూరల్: పెనుకొండ పట్టణ పరిధిలోని మడకశిర వైపు నుంచి పెనుకొండ వెళ్లే రహదారిలో షీఫారం రైల్వే వంతెన సమీపంలో రహదారి మధ్యలో గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. అధికారులు వర్షం నీరు వెళ్లేందుకు వీలుగా రహదారి మధ్యలో డ్రైనేజీ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే డ్రైనేజీపై ఇనుప చువ్వలను అమర్చారు. అయితే అధిక బరువు ఉన్న వాహనాల రద్దీకి డ్రైనేజీపై ఉన్న ఇనుప చువ్వలు విరిగిపోవడంతో ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు దారిపై అవగాహన ఉన్నప్పటికీ, కొత్తగా ప్రయాణించే వాహనదారులు ఆదమరిస్తే మాత్రం ప్రమాదం తప్పదని స్థానికులు చెబుతున్నారు. ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకముందే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: నియోజకవర్గంలోని పలువురికి బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఏడుగురు లబ్ధిదారులకు రూ.5.20 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ సభ్యుడిగా సాయిరాం

చిలమత్తూరు: ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీలో చిలమత్తూరుకు చెందిన సాయిరాంకు కమిటీ సభ్యుడిగా చోటు దక్కింది. ఈ నెల 24, 25 తేదీల్లో పెనుకొండలో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల్లో జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. సాయిరాం మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు.

మామిడి తోటకు నిప్పు

మడకశిరరూరల్: మండల పరిధిలోని క్యాంపురం సమీపంలో రైతు నారాయణప్పకు చెందిన మామిడి తోటకు మంగళవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వగా వారు మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదంతో తీవ్రంగా నష్టం జరిగిందని బాధిత రైతు తెలిపారు.

భక్తజన సంద్రంగా ‘లేపాక్షి’



లేపాక్షిలో శివపార్వతుల గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



వీరభద్రస్వామి దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు

- వేడుకగా శివపార్వతుల కల్యాణం
- నేడు వీరభద్రస్వామి బ్రహ్మరథోత్సవం

లేపాక్షి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్రస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్, ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి పర్యవేక్షణలో మధ్యాహ్నం వేదమంత్రాల మధ్య శివపార్వతుల కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శివపార్వతుల కల్యాణోత్సవం విశిష్టతను ఆగమికులు సునీల్‌శర్మ భక్తులకు వివరించారు. ఉదయం అభిషేకార్చనలు, దీపోత్సవం, రుద్రహోమము, వృషభ వాహనోత్సవం, సాయంత్రం నాలుగు యామముల పూజలు ఘనంగా జరిగాయి. అలాగే ఏడు శిరస్సుల నాగేంద్రుని విగ్రహం వద్ద అర్చకులు కాలసర్ప దోష నివారణ పూజలు చేశారు. గురువారం వీరభద్రస్వామి బ్రహ్మ రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. మరోవైపు హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు ఆ పరమేశ్వరుడిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.



పెనుకొండ: శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ దంపతులు



చిలమత్తూరు మండలం కొడికొండలో పూజలందుకున్న పంచనందీశ్వరుడు



మడకశిర కన్యకాపరమేశ్వరి ఆలయంలో నగరేశ్వరస్వామి